సాక్షి
అనంతపురం

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



పిక్కలు పీకుతున్నాయ్

జనాలపై కుక్కలు దాడి చేస్తున్నాయి. పిక్కలు పీకుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

8లో



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7 పలికింది.

గరిష్టం/కనిష్టం

41.6°/22.9°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉండడంతో వేసవి తాపం అధికంగా నెలకొంది. ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్	సహెరి
6.34	4.57

పది విద్యార్థులకు విజయోస్తు

- నేటి నుంచి టెన్త్ పరీక్షలు
- 139 కేంద్రాల్లో హాజరుకానున్న 35,305 మంది విద్యార్థులు
- తొలిరోజు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలంటున్న డీఈఓ



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు

రాప్తాడు రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 139 కేంద్రాల్లో 35,305 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. ప్రతి కేంద్రంలోనూ మౌలిక వసతులు కల్పించారు. ముఖ్యంగా నేలపై కూర్చుని పరీక్షలు రాయకూడదనే దృఢసంకల్పంతో అన్ని కేంద్రాల్లోనూ ఫర్నీచరు ఏర్పాటు చేశారు. తాగునీరు, నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు, లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుంది. తొలిరోజు విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకుని హాల్‌టికెట్ నంబరు చెక్ చేసుకోవాలని డీఈఓ సాయిరామ్ సూచించారు. విద్యార్థులు భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

చిన్న పొరపాటుకూ తావీయొద్దు

పరీక్షల నిర్వహణలో తొలిరోజు నుంచి చివరి రోజు దాకా ఏ చిన్న పొరపాటుకూ తావీయొద్దని డీఈఓ ఆదేశించారు. మొత్తం 139 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 139 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులతో పాటు 2,094 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. బాలికలను తనిఖీలు చేయడంలో భాగంగా ప్రతి కేంద్రంలోనూ మహిళా ఇన్విజిలేటర్లను నియమించారు. మొత్తం 1,280 మంది పురుష ఇన్విజిలేటర్లు, 814 మంది మహిళా ఇన్విజిలేటర్లు ఉన్నారు. 310 నుంచి 340 మంది విద్యార్థులున్న 30 కేంద్రాలకు అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు.

25 యాక్ట్ అమలు

పరీక్షల నిర్వహణలో కఠినమైన '25 యాక్ట్' అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రంలో ఏ తప్పు జరిగినా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, ఇన్విజిలేటర్లదే పూర్తి బాధ్యత. సెల్‌ఫోన్లు ఎవరికీ అనుమతించరాదు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను పంపే సమయంలో చెక్ చేసి పంపాలి. చిట్టీలు దొరికినా, పేపరు లీకు తదితర ఘటనలు జరిగినా యాక్ట్ 25 మేరకు చర్యలు తీసుకుంటారు. సిబ్బంది సమన్వయంతో పని చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులు సూచించారు.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

అనంతపురం సెంట్రల్: పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించినట్లు రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. పరీక్షా కేంద్రానికి, పరీక్ష పూర్తయిన తర్వాత గమ్యస్థానానికి ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. మూడో తేదీ నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు జరిగే రోజుల్లో మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు.

పరీక్షల షెడ్యూల్..

పదో తరగతి పరీక్షలు మూడో తేదీన మొదలై 15వ తేదీతో ముగుస్తాయి. తొలిరోజు సోమవారం తెలుగు, 6న హిందీ, 8న ఇంగ్లిష్, 10న గణితం, 13న సైన్స్, 15న సోషల్ పరీక్షలు ఉంటాయి. అలాగే ఈ నెల 17న కాంపోజిట్, 18న ఒకేషనల్ కోర్సు పరీక్షలు ఉంటాయి.

చాట్‌బాట్ సంచలనం

- అద్భుతాలు సృష్టిస్తున్న పోలీసు శాఖ
- వివిధ కేసుల్లో రూ.9.75 కోట్ల విలువ చేసే 6,026 మొబైల్ ఫోన్ల రికవరీ
- తాజాగా 382 మంది బాధితులకు ఫోన్ల అప్పగింత



మొబైల్ ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంతో పనిచేసే చాట్‌బాట్ సేవలు సంచలనానికి మారుపేరుగా నిలిచాయి. ఈ సేవలను అందుబాటులోకి తెచ్చిన ఏడాదిలోనే జిల్లా పోలీసు శాఖ ఎన్నో అద్భుతాలు సృష్టించింది. వివిధ సందర్భాల్లో తమ స్మార్ట్‌ఫోన్లను పోగొట్టుకున్న వారి నుంచి ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసు శాఖ స్పందించి వాటి రికవరీకి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకూ రూ.9.75 కోట్ల విలువ చేసే 6,026 ఆధునాతన స్మార్ట్‌ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు ఎస్పీ ఫక్కీరప్ప అప్పగించారు. తాజాగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 382 ఫోన్లను సంబంధీకులకు ఎస్పీ అందజేశారు.

ఎల్లలు దాటిన సేవలు : ఫోన్ పోయిందా..గోవిందా అనుకునే రోజులు పోయాయి. పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు వెతికి మరీ ఉచితంగా ఇంటికి చేరుస్తున్నారు. జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాలతో అమలవుతున్న 'చాట్‌బాట్' సేవలు రాష్ట్ర సరిహద్దులు దాటాయి. ఇప్పటి వరకూ రికవరీ చేసిన ఫోన్లను 15 రాష్ట్రాల్లోని సంబంధీకులకు అందజేశారు. ఇందులో కర్ణాటక ప్రాంతానికి చెందిన 221, తెలంగాణ 130, కేరళ 39, మహారాష్ట్ర 23, తమిళనాడు 20, ఒడిశా 6, ఉత్తరప్రదేశ్ 6, ఢిల్లీ 8, బిహార్ 5, మధ్యప్రదేశ్ 5, రాజస్తాన్ 105, పంజాబ్ 2, పశ్చిమ బెంగాల్ 3, గోవా 1, హర్యానాకు 2 చొప్పున మొత్తం 476 ఫోన్లను కొరియర్ సర్వీసు ద్వారా ఉచితంగా డోర్ డెలివరీ చేశారు.

ఏపీలోని 18 జిల్లాల బాధితులకు ఊరట : జిల్లా పోలీసు శాఖ చేపట్టిన చాట్‌బాట్ సేవల ద్వారా ఇప్పటి వరకూ ఏపీలోని 18 జిల్లాలకు చెందిన 5,550 మంది బాధితులకు ఊరట కలిగింది. ఇందులో అనంతపురం జిల్లాకు చెందిన 3,497 మంది ఉండగా.. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 935 మంది, కర్నూలు 532 మంది, వైఎస్సార్ జిల్లాకు చెందిన 160 మంది, చిత్తూరు 110 మంది, నెల్లూరు 55 మంది, తూర్పు గోదావరి 50 మంది, గుంటూరు 48 మంది, ప్రకాశం 34 మంది, తిరుపతి 32 మంది, పశ్చిమ గోదావరి 29 మంది, కృష్ణా 19 మంది, విశాఖపట్నం 17 మంది, శ్రీకాకుళం 8 మంది, విజయవాడ 10 మంది, విజయనగరం ఏడుగురు, కాకినాడ నలుగురు, ఏలూరుకు చెందిన ముగ్గురు చొప్పున ఉన్నారు. చాట్‌బాట్ సేవలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.9.75 కోట్ల విలువ చేసే స్మార్ట్ ఫోన్లను అనంత పోలీసులు రికవరీ చేయడం గమనార్హం.

ఎఫ్‌ఐఆర్ లేకుండానే... : సెల్‌ఫోన్ పోతే బాధితులు పోలీసు స్టేషన్లకు వెళ్లకుండానే, ఎఫ్‌ఐఆర్‌తో సంబంధం లేకుండానే రికవరీ చేసి అందజేస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఫోన్ పోగొట్టుకున్న వారు వాట్సాప్ నంబర్ 9440796812కు సమాచారం అందించడం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (చాట్‌బాట్) పనితీరు మొదలవుతుంది. పోగొట్టుకున్న ఫోన్‌కున్న సాంకేతిక నంబర్ ఆధారంగా అది ఎక్కడ పనిచేస్తోంది గుర్తించి, రికవరీ చేసేలా జిల్లా పోలీసు శాఖలోని సాంకేతిక విభాగం పనిచేస్తోంది.

న్యూస్‌రీల్

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



గార్లదిన్నె: బెంగళూరు నుంచి గుంతకల్లు వైపు వెళ్తున్న గూడ్స్ రైలు గార్లదిన్నె మండలం కల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున పట్టాలు తప్పింది. ఆరవ సైడ్ ట్రాక్‌పై మూడు వ్యాగిన్లు పట్టాలు తప్పినట్లు సమాచారం అందగానే రైల్వే యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్ సిబ్బంది హుటాహుటిన చేరుకున్నారు. పడిపోయిన బోగీలను ట్రాక్‌పై నుంచి తొలగించారు. ఈ ఘటనతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రెండు గంటలపాటు ఆలస్యంగా నడిచాయి. గూడ్స్ రైలు ప్రమాదంలో ఎవ్వరూ గాయపడలేదని అధికారులు తెలిపారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు

రాప్తాడురూరల్: పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఒంటిపూట బడుల నిర్వహణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం నుంచి అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశించింది. జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విధిగా ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు నడపాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆదేశించారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఆరు రోజులు తక్కిన తరగతులకు సెలవులు ప్రకటించారు. అయితే ఈ నెల 30లోగా ఈ ఆరు రోజులను సెలవుదినాల్లో ఆయా తరగతుల విద్యార్థుల కోసం పాఠశాలలు పెట్టుకోవాలని స్పష్టం చేశారు.

'మిషన్ వాత్సల్య'కు 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

- నిరాదరణ చిన్నారులకు అవకాశం
- విద్య, వైద్య అవసరాలు తీర్చనున్న ప్రభుత్వాలు

అనంతపురం సెంట్రల్: ఆదరణకు నోచుకోని పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్' పథకం ప్రవేశపెట్టినట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి తెలిపారు. ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం అవసరాలు తీర్చేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు. అనాథ పిల్లలు, తల్లిదండ్రుల్లో ఒకరు మృతి చెందినా, ప్రాణాంతక వ్యాధుల బారిన పడిన వారు, ఇళ్లు లేని, ప్రకృతి వైపరీత్యాలకు గురైన, దివ్యాంగులు తదితర బాలలు ఈ పథకానికి అర్హులని వివరించారు. అర్హులైన వారికి ప్రతినెలా రూ.4 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తారని వెల్లడించారు. దరఖాస్తులను ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

ఏషియన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇండియా జట్టు ఎంపిక



ఎంపికలకు హాజరైన వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జపాన్ వేదికగా త్వరలో జరిగే ఏషియన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు భారత్ తరపున హాజరయ్యే పురుషుల జట్టును ఆదివారం ఎంపిక చేశారు. అనంత క్రీడాగ్రామం వేదికగా చేపట్టిన ఈ ప్రక్రియకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వీరికి వివిధ విభాగాల్లో పోటీ నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారిని ప్రాబబుల్స్ జట్టుకు ఎంపిక చేశారు. వీరికి దేశవ్యాప్తంగా మూడు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చిన అనంతరం ప్రతిభ చాటుకున్న క్రీడాకారులతో తుది జట్టును జూన్‌లో ఎంపిక చేయనున్నారు. ఈ ప్రక్రియను జాతీయ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ ప్రవీణ్ అనౌకర్, ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, దేశ్‌పాండే, ఆర్డీటీ సురేంద్ర, పీడీలు కేశవమూర్తి, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, కార్యదర్శులు ప్రసాద్, విజయ్, కోచ్‌లు శివ, బద్రీనారాయణ, సాయి పాల్గొన్నారు.

గ్రామస్తులకు పట్టుబడ్డ గొర్రెల దొంగ

తాడిమర్రి: గొర్రెలను అపహరించుకెళ్లేందుకు వచ్చిన ఓ యువకుడిని స్థానికులు పట్టుకుని చెట్టుకు కట్టేశారు. వివరాలు... తాడిమర్రి మండలం మరువపల్లిలో ఆదివారం వేకువజాము 2 గంటలకు గొర్రెలను అపహరించుకెళ్లేందుకు ఓ ముఠా సభ్యులు వచ్చారు. ఆ సమయంలో గొర్రెల అరుపులతో అప్రమత్తమైన కాపరులు వన్నూరప్ప, లక్ష్మీనారాయణ.. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించి, ఓ యువకుడిని పట్టుకున్నారు. మిగిలిన ముగ్గురు పారిపోయారు. పట్టుబడిన దొంగను చెట్టుకు కట్టేసి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది అక్కడకు చేరుకుని దొంగను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నిందితుడిని నార్శింపల్లికి చెందిన వాడిగా గుర్తించారు. మిగిలిన ముగ్గురి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. దొంగలు వచ్చిన ఆటోను స్వాధీనం చేసుకుని, ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హజ్ యాత్రికులూ డిపాజిట్ చెల్లించండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా నుంచి హజ్ యాత్రకు ఎంపికైన వారు డిపాజిట్ మొత్తాన్ని ఈ నెల 7వ తేదీ లోపు చెల్లించాలని జిల్లా హజ్ కన్వీనర్ ముస్తాక్ మౌలానా బఖ్వీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. యాత్రికులు రూ. 81,500 డిపాజిట్ చెల్లించి, ఇందుకు సంబంధించిన రసీదు, మెడికల్ స్క్రీనింగ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు కాపీలను అందజేయాలన్నారు. పూర్తి సమాచారానికి 94400 17720లో సంప్రదించాలని కోరారు.

పిక్కలు పీకుతున్నాయ్





- మనుషులపై దాడిచేస్తున్న కుక్కలు
- నెలకు సగటున 720 మంది కుక్కకాటు బాధితులు
- జిల్లా వ్యాప్తంగా జనాలను వణికిస్తోన్న ఊరకుక్కలు
- భారీగా కుక్కల సంతతి పెరుగుతున్నట్టు నిపుణుల అంచనా

గుంతకల్లులో పెంపుడుకుక్క దాడిలో గాయపడిన నాగరాజు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మనుషులు ఒంటరిగా కనిపించినా.. బైక్‌లపై వెళ్తున్నా.. రాత్రిపూట బయట తిరిగినా కుక్కలు అమాంతం మీదపడి దాడి చేస్తున్నాయి. కుక్కే కదా అనుకుంటే రెచ్చిపోతున్నాయి. దొరికిన వారిని దొరికినట్టు కరుస్తూ గాయపరుస్తున్నాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా కుక్కలదాడికి గురవ్వాల్సి వస్తోంది. జిల్లాలో సగటున నెలకు 720 మంది కుక్కకాటు బాధితుల కేసులు నమోదవుతున్నాయి. 2022వ సంవత్సరంలో మొత్తం 8,600 కుక్కకాటుబారిన పడ్డారు.

చిన్నారులే లక్ష్యం..

కుక్కకాటు బాధితుల్లో ఎక్కువ శాతం 14 ఏళ్లలోపు చిన్నారులుండటం విస్మయపరిచే అంశం. ఊరకుక్కల సంతతి అమాంతంగా పెరిగినట్టు కూడా పశువైద్యుల అంచనా వేస్తున్నారు. కుక్కకాటును నిర్లక్ష్యం చేస్తే అత్యంత భయంకరమైన రేబిస్ వ్యాధికి గురై మృతి చెందే అవకాశాలున్నాయి. ఏటా భారతదేశంలో 29వేల మంది రేబిస్ వ్యాధితో మృతిచెందుతున్నట్టు అంచనా.

వేసవిలో మరీ ఎక్కువ

ఎండాకాలంలో వీధి కుక్కలకు ఆహారం, నీరు సరిగా లభించదని, దీనికి తోడు ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల కుక్కల్లో ఇరిటేషన్ పెరిగి మనుషులపై దాడులు చేస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. మిగతా సీజన్ కంటే వేసవిలోనే కుక్కకాటు కేసులు ఎక్కువగా ఉంటాయంటున్నారు. ఈ రెండు మూడు నెలల కాలంలో కుక్కల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పాము కాటు కేసులూ భారీగా నమోదు

జిల్లాలో గతేడాది పాము కాటు కేసులూ భారీగానే నమోదయ్యాయి. 9వేల మందికి పైగా పాముకాటు బాధితులు నమోదయ్యారు. 24వేల డోసుల ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వీనం) వ్యాక్సిన్ వినియోగం అయ్యింది. వర్షాలు అధికంగా పడటం వల్ల పాములు పెరిగాయి. 80 శాతం మంది పాము కాటు బాధితులు గ్రామీణ ప్రాంతం వారే ఉన్నారు. కుక్కకాటు బాధితులు ఎక్కువగా అర్బన్ ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. జిల్లాలో 80 వేల వరకూ కుక్కల సంఖ్య ఉండొచ్చని అంచనా.

2022 సంవత్సరంలో కుక్కకాటు కేసులు

నెల	కేసుల సంఖ్య
జనవరి	672
ఫిబ్రవరి	787
మార్చి	828
ఏప్రిల్	804
మే	898
జూన్	668
జూలై	648
ఆగస్ట్	737
సెప్టెంబర్	800
అక్టోబర్	793
నవంబర్	973
డిసెంబర్	1011

(ఇవి కాకుండా 2023 జనవరిలో 963, ఫిబ్రవరిలో 805, మార్చిలో 941 కేసులు నమోదయ్యాయి)

ఏ కుక్క కరచినా ఏఆర్‌వీ వేయాల్సిందే

పెంపుడు కుక్కనా, ఊరకుక్కనా అని కాకుండా ఏ కుక్క కరచినా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయాలి. కానీ పిచ్చి కుక్క కరిస్తే ఇమ్యునోగ్లోబిలిన్ ఇంజక్షన్ వేయాల్సిందే. కుక్క కరవగానే గాయాన్ని కుళాయి పైపు లేదా నీళ్ల ఫోర్సుగా వచ్చే పైపు కింద పెట్టాలి. ఆ తర్వాత కట్టు కట్టి డాక్టర్‌ను సంప్రదించాలి. ఐదు డోసుల యాంటీరేబిస్ వ్యాక్సిన్ వేయాలి. ఇళ్లలో పెంచుకునే కుక్కలకు తరచూ పశువైద్యులతో టీకాలు వేయిస్తుండాలి.

–డా.ఫణిమహేశ్వరరెడ్డి, జనరల్‌సర్జన్, అనంతపురం

కుక్కలకు ఆపరేషన్, వ్యాక్సినేషన్

కుక్కల బెడద నివారణలో భాగంగా ఆపరేషన్ చేయించి సంతానోత్పత్తి తగ్గించడం, వ్యాక్సినేషన్‌కు చర్యలు తీసుకుంటాం. కుక్కను పట్టుకుని, ఆపరేషన్ చేయడానికి ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాం. ఆపరేషన్‌కు వినియోగించే పరికరాల కొనుగోలుకు టెండర్లను పిలిచాం. ఈ రెండింటి ప్రక్రియ మరో 20 రోజుల్లో పూర్తవుతుంది. ప్రాధాన్యతా క్రమంలో నివారణ చర్యలు చేపడుతాం.

– జి.రమణారెడ్డి, కమిషనర్, నగరపాలక సంస్థ, అనంతపురం

జెడ్పీ ఉద్యోగి అకాల మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

అనంతపురం సిటీ: పామిడి మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి(ఏఓ)గా పని చేస్తున్న పీటీ శ్రీనివాసరావు(58) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆయన ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు మృతి చెందినట్లు జెడ్పీ అధికారులు వెల్లడించారు. ఆయనకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా తొలుత శెట్టూరులో ఉద్యోగ జీవితం ప్రారంభించిన శ్రీనివాసరావు... చిలమత్తూరు మండలం కోడూరు, లేపాక్షి మండలం దేమకేతేపల్లి, కుందుర్పి, కనగానపల్లి, అగళిలో పని చేశారు. అనంతపురం ఆర్‌డబ్ల్యూఎస్‌లో కొన్నాళ్లు పని చేసిన అనంతరం పామిడి మండల పరిషత్ కార్యాలయ ఏఓగా బదిలీ అయ్యారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేస్తూ అధికారులు, ప్రజల మన్ననలు పొందేవారు. శ్రీనివాసరావు మృతిపై జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ భాస్కరరెడ్డి, డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ అమృతరాజ్, తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కాగా, శ్రీనివాసరావు మృతదేహాన్ని ఆదివారం రాత్రి 10 గంటల తర్వాత అనంతపురానికి తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు ఉంటాయని పేర్కొన్నారు.

ఏపీఎల్ చైర్మన్‌గా మాంఛో



అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) చైర్మన్‌గా ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నం వేదికగా ఆదివారం జరిగిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయనను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌చంద్రారెడ్డి, గోపీనాథరెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, సీఈఓ ఎంవీ శివారెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్ రెడ్డి, మధు అభినందనలు తెలిపారు.

లోకేష్.. నోరు అదుపులో పెట్టుకో

- విప్ కాపు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి (చిత్రంలో) ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, పైలా నరసింహయ్య, గిరిజమ్మ

రాయదుర్గం: దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన రాజకీయ నేతగా గుర్తింపు పొందిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. రాయదుర్గంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు డబ్బిచ్చి జనాన్ని పోగు చేసుకుంటున్నారన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న అనంతలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇందుకు పుట్టపర్తి, రాప్తాడులో చోటుచేసుకున్న ఘటనలే నిదర్శమన్నారు. లోకేష్ ప్రసంగాలతో ప్రభావితమైన వ్యక్తి రాప్తాడులో వైఎస్సార్‌సీపీ నేత బిల్లె శ్రీనివాస్‌ను దారుణంగా హతమార్చాడని గుర్తు చేశారు. ఇది బాధాకరమన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే జనం తిరగబడి తంతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, ఎంపీపీ విద్యావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

పప్పు, పరిటాల కుటుంబంతోనే 'జాకీ' దూరం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: పప్పు లోకేష్, పరిటాల కుటుంబం చర్యల ఫలితంగానే జాకీ పరిశ్రమ జిల్లాకు దూరమైందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఆసరా వారోత్సవాలకు ఎమ్మెల్సీ మంగమ్మతో కలసి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. 2016లో రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ ఏర్పాటు కోసం రూ.140 కోట్ల విలువ చేసే 28 ఎకరాల భూమిని చంద్రబాబు, లోకేష్ బినామీ సంస్థ ఫేజ్ ఇండస్ట్రీకి రూ.3 కోట్లకే అప్పటి పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్, జిల్లా మంత్రిగా ఉన్న పరిటాల సునీత కట్టబెట్టారని గుర్తు చేశారు. 2018 నాటికి ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి, ప్రజలను నమ్మించి ఈ పనీ పూర్తి చేయలేకపోయారన్నారు. వారి చేతగాని తనానికి, వేధింపులుకు పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయకుండా యాజమాన్యం వెనక్కు మళ్లిందన్నారు. ఈ విషయాలన్నీ అప్పట్లోనే పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయన్నారు. ఇప్పటికీ వారు ఆధీనంలో ఉంచుకున్న ఆ భూమిని తనకు అప్పగిస్తే ఉచితంగా పరిశ్రమ నిర్మించి ఆరు వేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తానని భరోసా నిచ్చారు. అలాగే దేవరకొండ, తోపుదుర్తి రిజర్వాయర్లను పూర్తి చేసి రైతులకు కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, వేల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొడితే సహించం

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వ



మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: అధికారం కోసం ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడితే చూస్తూ ఊరుకోబోమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హెచ్చరించారు. వజ్రకరూరులో ఆదివారం నిర్వహించిన ఆసరా వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మెగా చెక్కు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ఎలాంటి అజెండా లేదనేది స్పష్టమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై నిరాధార ఆరోపణలు చేయడం, అసత్యాలతో ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ప్రయత్నించడం కాకుండా అధికారంలోకి వస్తే తామేమి చేస్తామో ప్రజలకు వివరిస్తే బాగుంటుందన్నారు. అలా కాకుండా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు సాగిస్తే సహించబోమన్నారు. లోకేష్ పాదయాత్రకు స్పందన కరువైందన్నారు. దీంతో స్థానిక టీడీపీ నేతలు ప్రజలను ప్రలోభాలకు గురి చేసి, సభకు తరలిస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నన్నీ రోజులూ రాష్ట్రం తీవ్ర దుర్భిక్షంతో కొట్టుమిట్టాడిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయన్నారు. వ్యవసాయ పనులు ఊపందుకుని గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంతత నెలకొందన్నారు. దీంతో ప్రజలందరూ వైఎస్ జగన్ వైపే ఉన్నారని, ఈ విషయాన్ని జీర్ణించుకోలేక ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడుస్థానాల్లో గెలిచినంత మాత్రాన భవిష్యత్తులో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనుకుంటే అది వారి భ్రమేనన్నారు. చంద్రబాబుతో సహా ఆయన దత్త పుత్రుడు పవన్‌కళ్యాణ్‌కు భంగపాటు తప్పదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోరు బండి దగ్ధం – ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



దగ్ధమవుతున్న బోరు బండి (ఇన్‌సెట్) మృతుడు పెన్నప్ప

ఆత్మకూరు: బోరు బండి దగ్ధమైన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం యర్రగుడి గ్రామానికి చెందిన బోయ పెన్నప్ప (48)కు భార్య రాజమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. అనంతపురంలోని ఓ బోరు రిగ్గు యజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లిలో ఓ రైతు పొలంలో బోరు వేసేందుకు సహాయకుడు, అనంతపురం నివాసి హాజీవలితో కలసి పెన్నప్ప వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో పొలానికి అడ్డంగా లాగిన విద్యుత్ లైన్ రిగ్గును తాకాయి. ఘటనతో విద్యుత్ ప్రసారం జరిగి వాహనం నడుపుతున్న పెన్నప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలో వెనుక కూర్చొన్న హాజీవలిని మంటలు చుట్టుముట్టాయి. ఘటనతో లారీ నుంచి హాజీవలి కిందకు దూకేశాడు. అప్పటికే తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు గంటలకు పైగా ఎగిసి పడుతున్న మంటలను చూసి స్థానికులు ఎవరూ అటుగా వెళ్లలేకపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సర్వీసులు

అనంతపురం సెంట్రల్: పౌర్ణమి సందర్భంగా ఈ నెల 6న అనంతపురం, గుంతకల్లు, రాయదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి డిపోల నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీగా సూపర్ లగ్జరీ బస్ సర్వీస్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. బస్సులు ఐదో తేదీ సాయంత్రం బయల్దేరి మంగళవారం గిరి ప్రదక్షిణ అనంతరం సాయంత్రం అరుణాచలం నుంచి బయల్దేరి బుధవారం తెల్లవారుజామున జిల్లాకు చేరుకుంటాయని తెలిపారు. బస్సు చార్జీ ఒక్కొక్కరికి అనంతపురం నుంచి రూ.1,450, గుంతకల్లు నుంచి రూ.1,860, తాడిపత్రి నుంచి రూ.1,345, ఉరవకొండ నుంచి రూ.1,570, రాయదుర్గం నుంచి రూ.1,860గా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్, ఏటీబీ ఏజెంట్, ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. 30 మంది బ్యాచ్‌గా ఏర్పడితే ఉచితంగా పికప్, డ్రాపింగ్ అవకాశం కూడా ఉందని తెలిపారు.

ఉచిత విద్య దరఖాస్తు గడువు పొడిగింపు

రాప్తాడురూరల్: విద్యాహక్కు చట్టం-2009, ఉచిత నిర్బంధ హక్కు చట్టం సెక్షన్ 12 (1) (సీ) మేరకు ప్రైవేట్ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 17 వరకు సచివాలయాల్లో ఉన్న సమాచారం ఆధారంగా దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తిస్తారు. 18న మొదటి రౌండ్ లాటరీ ఫలితాలు విడుదల చేస్తారు. 19 నుంచి 25 వరకు ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల ప్రవేశాలను నిర్ధారిస్తాయి. 29న రెండో రౌండ్ లాటరీ ఫలితాలు విడుదల చేస్తారు. మే 1 నుంచి 5 వరకు ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల ప్రవేశాలను నిర్ధారిస్తాయి.

వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... కళ్యాణదుర్గంలోని పార్వతీనగర్‌లో నివాసముంటున్న నాగభూషణాచారి (50)కి భార్య త్రివేనిదేవి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతంలో బంగారు నగల దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే వ్యాపారంలో అప్పులు పెరిగిపోవడంతో వాటిని తీర్చేందుకు ఉన్న ఇంటిని అమ్ముకోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి మానసికంగా కుదేలైన నాగభూషణాచారి క్రమంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి తన గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఎంతసేపటికీ గదిలో నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు కిటికీలో నుంచి చూడగా అసలు విషయం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగమధు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పూల దుకాణంలో చోరీ

యల్లనూరు: స్థానిక పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న అత్తార్ మసూద్‌వలి పూల దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... రోజూ పూలు అమ్మగా వచ్చిన డబ్బును దుకాణంలోనే మసూద్‌వలి భద్రపరిచేవాడు. ఈ క్రమంలో దాదాపు రూ.2.20 లక్షలు పోగయ్యాయి. శనివారం రాత్రి దుండగులు దుకాణంలోకి చొరబడి మసూద్‌వలి దాచుకున్న డబ్బు మొత్తం ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం దుకాణానికి వచ్చిన యజమాని ఈ విషయాన్ని గుర్తించి, ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రామకృష్ణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కేసు నమోదు చేస్తామంటూ బాధితుడికి భరోసానిచ్చారు.

వేమన ఉత్సవాలు ప్రారంభం

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో విశ్వకవి యోగి వేమన ఉత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాశక్తి పూజను నిర్వహించారు. ఆలయం ఎదుట ధాన్యపు రాశిని పోసి పసుపు, కుంకుమ కలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అందజేశారు. ఉత్సవాలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాక, వైఎస్సార్, నెల్లూరు, కర్నూలు జిల్లాలతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి చాందినీ బండ్లమెరవణి ఉంటుంది.

పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తప్పవు

- ఆర్‌జేడీ ప్రతాప్ రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న పది పరీక్షల పరిశీలకులు ప్రతాప్ రెడ్డి

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా జరగనున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాలలో ఎటువంటి పొరపాట్లు జరిగినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని పది పరీక్షల పరిశీలకులు, కడప ఆర్‌జేడీ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పరీక్షల నిర్వహణపై కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయంలో ఆయన సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలలో సభ్యులైన డిప్యూటీ తహసీల్దార్‌లు, ఏఎస్సైలు, ఎంఈఓలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ విజయవంతం చేయాలని కోరారు. పరీక్షా కేంద్రాలలో నియమనిబంధనల మేరకు సిబ్బంది వ్యవహరించాల్సిందేనన్నారు. చీఫ్ సూపరిండెంట్,డిపార్ట్‌మెంటల్ అధికారులతో పాటు,వైద్య,పోలీస్ సిబ్బందితో పాటు ఇతరులెవ్వరూ పరీక్షా కేంద్రాలలోకి సెల్‌ఫోన్‌లు తీసుకువెళ్లకూడదన్నారు. పక్కాగా 144 సెక్షన్ అమలు చేసేలా ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షా సమయంలో తెరుచుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్క్వాడ్ సభ్యులు విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించాలన్నారు. మహిళా ఇన్విజిలేటర్లతో మాత్రమే బాలికలను తనిఖీ చేయాలని, బాలికల పట్ల అనుచితంగా వ్యవహరించరాదని లేని పక్షంలో ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. స్క్వాడ్ బృందాలు తమకు కేటాయించిన రూట్లలో నిబంధనల మేరకు తనిఖీలు చేస్తూ పేపర్‌లీకేజీలు, మాల్‌ప్రాక్టీస్‌లు లేకుండా పర్యవేక్షించాలన్నారు.

క్లుప్తంగా

సంతల ఆదాయం రూ.3.53 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన సంతల ద్వారా రూ.3.53 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1.83 లక్షలు వసూలు కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1.69 లక్షల ఆదాయం వేలం ద్వారా సమకూరినట్లు పేర్కొన్నారు.

సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సర్ప రూప సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. అనంతరం స్వామికి పట్టువస్త్రాలు, బంగారు కవచం, ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో రాహుకేతు హోమాలు నిర్వహించారు. మంజునాథస్వామి, పార్వతిదేవికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

సరస్వతీ దేవి అలంకారంలో కోదండరాముడు


హంస వాహనంపై దర్శనమిచ్చిన శ్రీరాముడు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో భద్రాచలాన్ని తలపిస్తూ సాగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం సీతారాములు హంస వాహనంపై ఊరేగి దర్శనమిచ్చారు. సరస్వతీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలందుకున్న శ్రీరాముడికి భక్తులు హారతులతో స్వాగతం పలికారు. సంప్రదాయ మంగళవాయిద్యాలు, గ్రామీణ భజన మండలి వారి భక్తిగీతాలాపనల మధ్య సీతారామచంద్రులు నగరవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నాట్య కళాకారులు శాస్త్రీయ నృత్యంతో భక్తినీరాజనాలర్పించారు.

సస్పెన్షన్ ఎత్తేయాలి


మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర యాదవ్ కోరారు. ఆదివారం ఎస్కేయూలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018 మార్గదర్శకాలకనుగుణంగా డిగ్రీ, పీజీ పరీక్షల మూల్యాంకనం చేయలేదన్నారు. దీంతో పదుల సంఖ్యలో విద్యార్థులను ఫెయిల్ చేశారన్నారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నించినందుకు ఐదుగురు విద్యార్థులను సస్పెండ్ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు రుషి, సందీప్, అనిల్ కుమార్, సన్నీ, ప్రతాప్ పాల్గొన్నారు.

జామియా మసీదు మేనేజర్‌గా తాహీర్ హుస్సేన్


తాహీర్ హుస్సేన్‌ను అభినందిస్తున్న వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ రిజ్వాన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని జామియా మసీదు మేనేజర్‌గా తాహీర్ హుస్సేన్‌ను నియమిస్తూ జిల్లా వక్ఫ్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హుస్సేన్‌సాహెబ్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కేంద్రంలోని జామియా మసీదుకు సంబంధించి ఇటీవల ముతవల్లిని సస్పెండ్ చేసిన నేపథ్యంలో జామియా మసీదుకు సంబంధించి ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దేందుకు మేనేజర్‌గా ఈయనను నియమించారు.

జగనన్నతోనే మహిళా సాధికారత


మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- 'వైఎస్సార్ ఆసరా' సభలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంటే గౌరవమని, మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రతి సంక్షేమ పథకంలో వారిని భాగస్వామ్యం చేస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరశివారులోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆసరా కార్యక్రమంలో 2,527 సంఘాలకు సంబంధించి రూ.20.08 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అంతకుముందు మొదట జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 1996లో టీడీపీ అధినేత చంద్రబాబు కిలో రూ.2 ఉన్న రేషన్ బియ్యాన్ని రూ.5.25 (ఐదుంపావలా) చేశారని, 2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మాట తప్పారన్నారు.

భయానక వాతావరణం : గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ మూడు వర్గాలుగా విడిపోయి, జిల్లా కేంద్రంలో భయానక వాతావరణం సృష్టించారని ఎమ్మెల్యే విమర్శించారు. డివైడర్ల వరకే అభివృద్ధి పరిమితం చేసి, నిత్యం నగరంలో అలజడి వాతావరణం సృష్టించారన్నారు. అనంతపురం నియోజకవర్గంలో రూ.600 కోట్లతో రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగరంలో అంతర్గత రోడ్లు, కాలువ ఏర్పాటుకు సీఎం ప్రత్యేకంగా రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. 85 సచివాలయాల పరిధిలో రూ.17 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అర్బన్ సెంటర్లు, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. రానున్న రోజుల్లో రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు చేయనున్నామన్నారు.

దుశ్చర్యలను తిప్పికొడదాం: సంక్షేమం, అభివృద్ధి చేస్తుంటే రాష్ట్రం అప్పులపాలవుతోందంటూ టీడీపీ, బీజేపీ, జనసేన దుష్ప్రచారం చేస్తున్నాయని, ఎలాగైనా..సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గద్దె దించాలని చేస్తున్న దుశ్చర్యలను తిప్పికొట్టాలని మహిళలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మహిళల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, మెప్మా పీడీ విజయలక్ష్మి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, శ్రీదేవి, కార్పొరేటర్లు గురుశేఖర్ బాబు, రహంతుల్లా, దుర్గాదేవి, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు భారతి, శోభారాణి, శోభాబాయి తదితరులు పాల్గొన్నారు.


అనంతపురంలో ఆసరా సభకు హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు

ప్రాణం ఉన్నంతవరకూ ప్రజాసేవ చేస్తా

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మహిళలకు మెగా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: 'రేయ్ పప్పూ.. నీకిదే హెచ్చరిక. నిజాయతీగా ఉన్న వాడి జోలికి దయచేసి రావొద్దు.. నిజాయితీగా ఉండే వాడికి పొగరుతో పాటు ధైర్యం, ఆత్మవిశ్వాసం ఎక్కువ.. నేను తప్పు చేసేవాడినైతే ఎవరికైనా లొంగాలి.. నా కట్టె కాలేదాకా నేను తప్పు చేయను.. ప్రాణం ఉన్నంత వరకూ ప్రజలకు సేవ చేస్తా' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో 'వైఎస్సార్ ఆసరా' సభను ఎమ్మెల్సీ మంగమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. మండలంలో 9,271 సభ్యులకు మంజూరైన రూ. 8.95 కోట్ల ఆసరా చెక్కును ఎమ్మెల్యే అందించారు. ముందుగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత డబ్బుతో రైతులకు ఉచితంగా బోర్లు వేయించామని.. దాదాపు 15 వేల మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇప్పించా, 2 వేల మందికి గొర్రెలు పంపిణీ చేశానని తెలిపారు.

25 ఏళ్లలో చేయలేని అభివృద్ధి చేశా...

నియోజకవర్గంలో పరిటాల కుటుంబం 25 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని .. నాలుగేళ్లలో తాను చేశానని గర్వంగా చెప్తున్నానని ఎమ్మెల్యే తోపుదుర్తి అన్నారు. టీడీపీ హయాంలో వారు చేసిన అభివృద్ధేమీలేదన్నారు. తోపుదుర్తి కుటుంబం, దాతల సహకారంతో రూ.15 కోట్లు వెచ్చించి, లక్ష లీటర్ల పాల సేకరణే లక్ష్యంగా డెయిరీ నిర్మించామన్నారు.

రోజుకు రూ.2 కోట్లు తిన్న చంద్రబాబు..

రాష్ట్రంలో 1995 వరకు ప్రభుత్వ సహకార డెయిరీ ఉండేదని, ఇందులో పాడి రైతులే భాగస్వాములని, చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే సహకార డెయిరీలన్నీ మూసేసి, హెరిటేజ్ డెయిరీని తీసుకొచ్చారని ఎమ్మెల్యే విమర్శించారు. 2019 వరకు పాల మద్దతు ధర హెరిటేజ్ సూచించిన ధర ఇచ్చేవారన్నారు. లీటరుకు రూ.20 లోపే ఇచ్చేవారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అమూల్ డెయిరీని తీసుకొచ్చారన్నారు. లీటరుకు రూ. 28 నుంచి రూ.32 దాకా తీసుకొచ్చారన్నారు. అంటే రూ.12 దాకా అదనంగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. పరిటాల సునీత సహకార డెయిరీ సభ్యుల డబ్బులు తాము వాడుకున్నట్లు విమర్శలు చేస్తోందన్నారు. కాణిపాకం వినాయకుడి మీద ప్రమాణం చేసి చెప్పాలని, పరిటాల రవీంద్ర కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు రామగిరి గనులు మూయించి, కార్మికుల పొట్టకొడితే ..జగన్‌మోహన్‌రెడ్డి ఆ గనుల తెరిపించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నేను ఎమ్మెల్యే అయిన తర్వాత జగనన్న ఆశీస్సులతో కర్ణాటక ముఖ్యమంత్రిని ఒప్పించి పెన్నానది మీదుగా నీరు తెచ్చి, మూడేళ్లగా పేరూరు డ్యాంను నింపుతున్నామన్నారు.

లోకేష్ ఎక్కడెళ్లినా అగ్గిరాజేస్తున్నాడు..

తాము అధికారంలోకొస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని కొందరు ఐఏఎస్ అధికారులతో చెప్తున్నారని, చంద్రబాబు, లోకేష్ మీకు దమ్మూధైర్యం ఉంటే ఈ మాట రాప్తాడు సెంటర్‌లోకి వచ్చి చెబుతారా? .. లేదా చెన్నేకొత్తపల్లి నడిబొడ్డుకు వచ్చి చెబుతారో? ..అధికారంలోకొస్తే ఏమి చేస్తారో చెప్పడంలేదన్నారు. కందికుంట వెంకటప్రసాద్ అనే వాడికి శిక్ష పడిందని, అతన్ని పెట్టుకొని తిరుగుతున్నారన్నారు. ప్రశాంతంగా ఉండే పుట్టపర్తిలో గురుశిష్యుల మధ్య కొట్లాట పెట్టాడని, లోకేష్ ఎక్కడికెళ్లినా అగ్గిపుల్ల గీస్తూ పోతున్నాడన్నారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఎంపీడీఓ అశోక్‌నాయక్, ఏపీఎం రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గోవింద రెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దోలా రామచంద్రా రెడ్డి, వైస్ ఎంపీపీ పసల గాయిత్రి, ఎంపీటీసీలు రాములమ్మ, జ్యోతి, సర్పంచులు ధనశ్రీ, మాడెం కృష్ణారెడ్డి, నాయకులు ఎస్డీడీ శ్రీనివాసరెడ్డి, ప్యాదిండి నరసింహారెడ్డి, సింగం హనుమంతరెడ్డి, బొగ్గు కిష్ట, హరినాథ రెడ్డి, మనేరు నరసింహులు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.


చెన్నేకొత్తపల్లిలో ఆసరా సభకు హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

నవరత్నాలతో ఇంటింటా వెలుగులు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం రూరల్: నవరత్నాలతో ఇంటింటా వెలుగులు నిండాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఆదివారం ఏ నారాయణపురం పంచాయతీ పరిధిలోని తపోవనంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేయాలని అక్కడి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు, ఎల్లో మీడియా మాత్రం బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయన్నారు.

అభివృద్ధి చేస్తామని చెప్పడం హాస్యాస్పదం

చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సొమ్ము దోచుకొని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, తాను మళ్లీ అధికారంలోకొస్తే అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. కరోనా కష్టకాలంలో ప్రపంచ దేశాలు సైతం ఆర్థికంగా దివాలాతీసినా, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నాయకులు, ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 2024 ఎన్నికల్లో తమ పార్టీ 2019 కంటే ఎక్కువ సీట్లతో విజయ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, ఎంపీటీసీ నాగేంద్ర, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, బి.మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు తిలోదకాలిచ్చే చర్యలొద్దు

- ముఖాముఖిలో రచయిత సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత, ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్: కేంద్ర ప్రభుత్వం తెస్తున్న ఈడబ్ల్యూఎస్ విధానం క్రమంగా రిజర్వేషన్లకు తిలోదకాలిచ్చే దిశగా సాగుతోందని ప్రముఖ రచయిత సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్ ఆందోళన వెలిబుచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో సుభాష్ చంద్రబోస్ రచించిన 'ఈడబ్ల్యూఎస్–రిజర్వేషన్లను అంతం చేసే కుట్ర' పుస్తకావిష్కరణ జరిగింది. అంబేడ్కర్ అక్షరీయం సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, ప్రజా సంఘాల నాయకుడు బీసీ నాగరాజు, ఆడవాల శేషగిరి రాయుడు, అరుణ తదితరులు పుస్తకావిష్కరణలో మాట్లాడారు. పలువురు మేధావులు, మానవతావాదులు అడిగిన అనేక ప్రశ్నలకు సుభాష్ చంద్రబోస్ సమాధానాలిచ్చారు. దేశంలో మళ్లీ మనువాదం తేవడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని, దోపిడీకి, వివక్షకు గురవుతున్న వారికి అండగా నిలిచే రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వ పాలకులు ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నారన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడానికే రిజర్వేషన్లు ఏర్పాటు చేశారని, కానీ ప్రైవేటీకరణ పేరుతో వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం సుభాష్ చంద్రబోస్‌ను పలువురు ప్రజా సంఘాల నాయకులు సత్కరించారు.

క్రికెట్ స్కాలర్‌షిప్ ఎంపికలకు స్పందన

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన క్రీడా మైదానంలో ఆదివారం హిందుస్థాన్ యూనీలివర్ స్కాలర్‌షిప్ ఎంపికలకు పోటీలు నిర్వహించారు.ఎంపికలకు ఉమ్మడి జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వారిలో ప్రతిభ కనబరచిన వారిని హైదరాబాద్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల క్రీడాకారులతో జరిగే క్రికెట్ టోర్నీలో రాణించిన క్రీడాకారిణులను స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేయనున్నారు.

18న అక్కల్‌కోట్ మహారాజ్ ఆరాధనోత్సవం

అనంతపురం కల్చరల్: నగనంలోని హెచ్చెల్సీ కాలనీలో వెలసిన శ్రీ వలీస్వామి ఆశ్రమంలో అక్కల్‌కోట మహారాజ్ ఆరాధనోత్సవం ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ప్రతినిధి విజయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం మహాగణపతి హోమం, నగర సంకీర్తన, ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, మధ్యాహ్నం అన్నసంతర్పణ ఉంటాయన్నారు. సాయంత్రం పూలపల్లకీలో అక్కల్‌కోట్ మహారాజ్ చిత్రపటాలతో శోభాయాత్ర ఉంటుందన్నారు.

ఆర్ఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్

రాప్తాదురూరల్: రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బి. ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రిజర్వేషన్ ఎంప్లా యీ స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్. రామచంద్ర, జిల్లా గౌరవాధ్యక్షుడు కోటి మల్లేష్ పాల్గొన్నారు.

10లోపు వివరాలు సమర్పించాలి

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ ఏడాది హజ్ యాత్రకు ఎంపికై న వారు ఈనెల 10లోపు తమ పూర్తి వివరాలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం హజ్‌కమిటీ సమన్వయకర్త అల్‌హజ్‌ముల్లా మస్తాన్ వలీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 హజ్ యాత్రకు ఎంపికైన వారు అడ్వాన్సు రుసుం రూ.81,800 చలానా లేదా ఆన్‌లైన్ రసీదు కాపీ, మెడికల్ సర్టిఫికెట్, ఒరిజినల్ పాస్‌పోర్టు, 2 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో జిల్లా హజ్ కార్యాలయంలో గానీ, లేదా విజయవాడ ప్రధాన కార్యాలయంలో గానీ సమర్పించాలని పేర్కొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


ఆత్మకూరు కేజీబీవీలో డెస్కులపై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

రాప్తాడు: మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది ఆయా స్కూళ్ల నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు 360 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల కోసం మండలంలో 5 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 1,203 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పది పరీక్షల కోసం అధికారులు మండలంలో ఐదు కేంద్రాలను కేటాయించారు. రాప్తాడు జెడ్పీహెచ్ఎస్‌లో 161 మంది, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 293 మంది, ఆర్డీటీ అంధుల పాఠశాలలో 189, విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 280, ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 280 మంది విద్యార్థులను కేటాయించారు. ఒక్కో కేంద్రంలో చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారితో పాటు 50 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటారని ఎంఈఓ మల్లికార్జున తెలిపారు.

ఆత్మకూరు: మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాల్లో అధికారులు డెస్కులపై హాల్‌టికెట్ల నంబర్లు వేశారు. కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించారు. మండల వ్యాప్తంగా 746 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్‌లో 254 మంది విద్యార్థులు, ఆత్మకూరు కేజీబీవీలో 192 మంది విద్యార్థులు, హోలి స్పిరిట్ ప్రైవేట్ పాఠశాలలో 300 మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ఇన్విజిలేటర్లు , సిట్టింగ్ స్క్వాడ్ ఇలా మొత్తం 45 మంది సిబ్బందిని నియమించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆలూరు సాంబశివారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: తమ సమస్యలు పరిష్కరించాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ కాంట్రాక్టు ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఆదివారం అనంతపురం నగరంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివా రెడ్డికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులకు నెలకు రూ.20 వేలు ఇస్తామని వర్సిటీ ఉన్నతాధికారులు ప్రకటించారన్నారు. అయితే పాలకమండలి ఆమోదం పొందలేదని, జీతం రూ.16 వేలకు కుదించినట్లు పేర్కొన్నారు. గత 22 ఏళ్లగా వర్సిటీలో చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మల్లిరెడ్డి, జనరల్ సెక్రటరీ మంజునాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డం ముత్యాలుకు జాతీయ అవార్డు

అనంతపురం కల్చరల్: సహాయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్న గడ్డం ముత్యాలు జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఉగాది మహానంది జాతీయ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు పోలజు రాజ్‌కుమార్, డాక్టర్ రామలింగం చేతుల మీదుగా జిల్లాకు చెందిన ముత్యాలు ఈ అవార్డు అందుకున్నారు.

భక్తిభావం నింపిన మట్టల ఆదివారం


మట్టలతో ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్లు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ప్రార్థనా మందిరాల్లో మట్టల ఆదివారం సంబరంగా జరిగింది. గుడ్ ఫ్రైడే పర్వదినానికి ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. జిల్లా కేంద్రంలోని సప్తగిరి సర్కిల్ సమీపంలోని ఎస్ఐయూ చర్చి, అరవిందనగర్ సీఎస్ఐ చర్చి, కళాకారుల కాలనీలోని రేమా చర్చి తదితర చోట్ల మట్టల ఆదివారం ప్రాశస్త్యాన్ని పాస్టర్లు వివరించారు. వీధుల్లో ఈత మట్టలు పట్టుకొని సామూహిక ప్రార్థనలు, భక్తిగీతాలను స్తుతించారు. రెవరెండ్ బెన్‌హర్‌బాబు, పాస్టర్ ఎమ్మెస్ సుధాకర్, సంపత్ విజయ్‌కుమార్, మనుష్యే తదితరులు వేర్వేరు చోట్ల బైబిల్‌లోని మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడేకి ముందు వచ్చిన ఆదివారం క్రీస్తు యెరూషలేములోకి ప్రవేశించగా అక్కడి భక్తులు ఖర్జూరపు మట్టలతో స్వాగతిస్తూ విజయోత్సవ ర్యాలీ చేసినట్లు తెలిపారు. అదే సంప్రదాయం నేటికీ కొనసాగుతోందన్నారు.

దాహార్తి..సేవా 'నీరు'తి



ఏప్రిల్ నెల ప్రారంభంలో ఎండలు మరింత ముదిరాయి..జనం ఇళ్లనుంచి అడుగు బయటకేయాలన్నా ఆలోచించే పరిస్థితి..పశువులే కాదు.. పక్షులు కూడా ఎండకు అల్లాడుతున్నాయి. కాసింత నీరు, నీడ దొరికితే చాలనుకుంటున్నాయి. పశుపక్ష్యాదులను దృష్టిలో ఉంచుకొని నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు టీవీచంద్రమోహన్‌రెడ్డి, శేఖర్‌బాబు, ఎంబీ శాంతిసుధ, కోఆప్షన్ సభ్యుడు లక్ష్మిరెడ్డి తదితరులు 45, 50, 44 డివిజన్లలో వీధుల్లోని చెట్ల కింద నీటితొట్టెలు ఏర్పాటు చేశారు. పశువులు, పక్షులు దాహార్తి తీర్చుకుంటుండడంతో వీరి సేవానిరతిని స్థానికులు కొనియాడుతున్నారు.

– అనంతపురం క్రైం

